సాక్షి
నిర్మల్
శనివారం । 24 । ఆగస్టు । 2024

గల్ఫ్‌గాయం.. తీరని దుఃఖం!



ఉపాధి కోసం గల్ఫ్‌కు వెళ్తున్న వారిలో పలువురు అనారోగ్యంతో చనిపోతున్నారు. మరికొందరు ఆత్మహత్యలకు పాల్పడుతూ విగతజీవులై పెట్టెల్లో వస్తున్నారు.

8లో▸



వైభవంగా సౌభాగ్యలక్ష్మీ వ్రతం

బాసర జ్ఞానసరస్వతీ ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా సౌభాగ్యలక్ష్మీ వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. మహిళలు అధిసంఖ్యలో పాల్గొన్నారు.

8లో▸

గరిష్టం/కనిష్టం
28.0 /24.0

వాతావరణం

ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

రుణమాఫీ కోసం రాస్తారోకో



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న రైతులు

కుంటాల: అర్హులైన రైతులకు రుణమాఫీ చేయాలని మండలంలోని పెంచికల్‌పాడ్ గ్రామ రైతులు శుక్రవారం మండల కేంద్రంలోని కల్లూరు–కుంటాల రహదారిపై రాస్తారోకో చేశారు. తహసీల్దార్, వ్యవసాయశాఖ కార్యాలయాల ఎదుట ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు. అన్ని అర్హతలున్న తమకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఇన్‌చార్జి ఏవో రవి, తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ రాజేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు.

పాఠశాలల ఆకస్మిక తనిఖీ



కేజీబీవీలో వంటలు పరిశీలిస్తున్న డీఈవో

తానూరు: మండలంలోని భోసి జెడ్పీ పాఠశాల, తానూరులోని కేజీబీవీని డీఈవో రవీందర్‌రెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలల్లో వసతులు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి బోధన సామర్థ్యాలను తెలుసుకున్నారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధించాలని, మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. ఆయన వెంట ఎంఈవో సుభాష్, ఉపాధ్యాయులున్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

భైంసాటౌన్: పట్టణంలోని నర్సింహానగర్ కల్యాణ మండపంలో శుక్రవారం కూచిపూడి నృత్యకారుడు, పద్మభూషణ్ అవార్డు గ్రహీత రాధా రాజారెడ్డిని ఎమ్మెల్యే రామారావుపటేల్ తదితరులు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. మండలంలోని కోతుల్‌గాంకు చెందిన రాధా రాజారెడ్డి కూచిపూడి నృత్యరంగంలో అందించిన సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్‌తో సత్కరించింది. మున్సిపల్ మాజీ చైర్మన్ గంగాధర్, రమేశ్ మాంధాని, నాగనాథ్ పటేల్, గంగారెడ్డి, డాక్టర్ రాజారెడ్డి, డాక్టర్ రామకృష్ణగౌడ్, జనార్దన్‌రెడ్డి, శేషరావు పటేల్, పోశెట్టి, లయన్స్ క్లబ్ ప్రతినిధులు శివ బచ్చువార్, జేకే పటేల్, కృష్ణదాస్, దుర్గాదాస్, ఆనందరావు పటేల్ ఉన్నారు.

హత్యాచార ఘటనపై నిరసన



ఆస్పత్రి ఎదుట నిరసన తెలుపుతున్న వైద్యులు

నిర్మల్‌చైన్‌గేట్: కోల్‌కతాలో జరిగిన జూనియర్ డాక్టర్ హత్యాచార ఘటనపై శుక్రవారం జిల్లా జనరల్ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ.. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ఆస్పత్రుల్లో సరైన సదుపాయాలు, రక్షణ చర్యలు లేని కారణంగానే ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయని ఆరోపించారు. సూపరింటెండెంట్ సునీల్ రాథోడ్ కుమార్, డాక్టర్లు ప్రొఫెసర్ శ్రీకర్, దయాకర్, అరుణ్‌కుమార్‌రెడ్డి, అమీనా, గాయత్రి, అరుణ్‌కుమార్, గౌతమ్, జయప్రకాశ్, క్రిష్, సాయికిరణ్, సాయిచరణ్, యశ్వంత్ పాల్గొన్నారు.

25న మెగా జాబ్‌మేళా



మాట్లాడుతున్న సేవా సమితి సభ్యులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని దీక్ష జూనియర్ కళాశాలలో అఖిల భారతీయ అయ్యప్ప సేవా ట్రస్ట్, సేవా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 25న మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు బద్రి శ్రీనివాస్, విగ్నేశ్ తెలిపారు. శుక్రవారం నిర్మల్ ప్రెస్‌క్లబ్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. దాదాపు 50 కంపెనీలకు పైగా 1,500 పైచిలుకు ఉద్యోగాలతో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 10వ తరగతి నుంచి ఉన్నత విద్య చదివిన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు ధ్రువపత్రాలు వెంట తీసుకురావాలని చెప్పారు. ట్రస్ట్, సేవాసమితి సభ్యులు జాప ప్రకాశ్, వస్త్రాల శివప్రసాద్, శ్రీనివాస్, కుంటాల సాయినాథ్, అరుణ్‌కుమార్, అడప నవీన్, మారుతి పాల్గొన్నారు.

పల్లె పోరుకు సన్నద్ధం



చించోలి (బీ) గ్రామపంచాయతీ కార్యాలయం

- ఓటరు లిస్ట్ తయారీకి షెడ్యూల్ ఖరారు
- వార్డుల వారీగా ఓటర్ల విభజన షురూ
- ఓటర్ల శాతంతోనే రిజర్వేషన్లు అమలు!
- ఎన్నికల విధుల్లో అధికారులు నిమగ్నం
- జిల్లాలో 396 గ్రామ పంచాయతీలు

నిర్మల్‌చైన్‌గేట్: పంచాయతీ ఎన్నికలు వీలైనంత త్వరగా నిర్వహిస్తామని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. బీసీ రిజర్వేషన్ల పెంపునకు సంబంధించిన ప్రక్రియ పూర్తికాగానే ఎన్నికలు నిర్వహిస్తామని వెల్లడించింది. ఇందుకు సంబంధించి ఇప్పటికే కసరత్తు ప్రారంభించింది. బీసీ రిజర్వేషన్ల పెంపుపై ఇప్పటికే కొన్ని ప్రతిపాదనలు సిద్ధం చేసింది. దీనిపై త్వరలోనే ఓ ప్రకటన వెలువడే అవకాశముంది. అలాగే ఓటర్ల జాబితా తయారీకి సంబంధించిన ప్రక్రియ కూడా ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు జిల్లా అధికారులు ఎన్నికల పనుల్లో నిమగ్నమయ్యారు.

పంచాయతీరాజ్ చట్టం 2018 ప్రకారం..

తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం–2018 ప్రకారం పంచాయతీ అధికారులు ఓటర్ల జాబితాలు సిద్ధం చేయాలని బుధవారం రాష్ట్ర ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసింది. గ్రామపంచాయతీల్లోని వార్డుల వారీగా ఓటర్ల జాబితా తయారు చేసేందుకు గ్రామపంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పనులు ప్రారంభించారు. గ్రామపంచాయతీ ఎన్నికలకు ఏ క్షణంలోనైనా ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసే అవకాశం ఉండడంతో సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయితే గతంలో జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్ల జాబితాలను పోలింగ్ బూత్‌ల వారీగా సిద్ధం చేసి ఉంచారు. ఇప్పుడు గ్రామపంచాయతీలోని వార్డులవారీగా జాబితా తయారు చేయాల్సి ఉంది. దీంతో గతంలో ఉన్న ఓటర్లతోపాటు మార్పులు, చేర్పులతో వార్డులవారీగా జాబితాలు రూపొందించాల్సి ఉంది. మేజర్ పంచాయతీ అయితే వార్డుకు 625 ఓట్లు కేటాయించనున్నారు. పంచాయతీ పరిధిలోని ఓటర్లను ప్రతీ వార్డుకు సమానంగా విభజించనున్నారు. ఓటర్ల జాబితా రూపకల్పనపై పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కూడా ఇస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

ఓటర్ల జాబితా షెడ్యూల్ ఇలా..

- సెప్టెంబర్ 6న ఫొటోలతో కూడిన ఓటరు జాబితాలు సిద్ధం చేయాల్సి ఉంది.
- సెప్టెంబర్ 9న జిల్లా, 10న మండల స్థాయిలో వివిధ పార్టీలతో సమావేశాలు నిర్వహించి ఓటరు జాబితాలపై అభిప్రాయాలు స్వీకరించనున్నారు.
- సెప్టెంబర్ 7 నుంచి 13వ తేదీ వరకు జీపీ నిబంధనల ప్రకారం అభ్యంతరాలు, ఓటర్ల సర్దుబాటు, తప్పొప్పులు సరిచేసుకునే అవకాశం ఉంటుంది.
- 19న డిస్పోజల్ ఆఫ్ అభ్యంతరాలు డీపీవోకు అందించాలి.
- 21వ తేదీన గ్రామపంచాయతీల వారీగా ఓటర్ల ఫొటోలతో కూడిన తుది జాబితాను ప్రదర్శనకు పెట్టాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

బీసీ గణన చేస్తే..

బీసీ గణన తెరపైకి రాగా ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు ఎప్పుడు వస్తే అప్పుడే అన్నట్లుంది. ఒకవేళ బీసీ గణన చేస్తే దానికి అనుగుణంగా సర్పంచుల రిజర్వేషన్లూ మారే అకాశముంది. ఈ విషయంపై ప్రభుత్వ పెద్దలు తీసుకునే నిర్ణయం కోసం ఆశావహులు ఎదురుచూస్తున్నారు. గతంలో మాదిరిగానే ఈసారి కూడా జిల్లాలోని పంచాయతీలను మూడు విడతలుగా విభజించి ఎన్నికలు నిర్వహించే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. 396 పంచాయతీల్లో స్థానిక పరిస్థితులు, శాంతి భద్రతలు, ఎన్నికల సిబ్బంది, అధికారుల పర్యవేక్షణ మొదలైన అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. అయితే.. పంచాయతీ ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయనే విషయంపై మరో కొద్ది రోజుల్లో స్పష్టత రానుందని అధికారులు చెబుతున్నారు.

రిజర్వేషన్ల మార్పు ఉంటుందా?

ఏ వార్డులో ఎంతమంది.. ఏ సామాజిక వర్గానికి చెందినవారున్నారు.. గ్రామ మొత్తంలో ఏ వర్గం వారు అధిక మొత్తంలో ఉన్నారనే అంశాలను పరిగణనలోకి తీసుకుని రిజర్వేషన్లు మార్చే అవకాశముంది. ముందుగా వార్డుల వారీగా విభజన చేసిన తర్వాత ఆ వార్డులో ఏ కులం వారు ఎంత మంది ఉన్నారనేది కూడా విభజించనున్నారు. దీంతో వార్డులు, గ్రామ పంచాయతీల రిజర్వేషన్లు ఖరారు కానున్నాయి. గతంలో ఉన్న రిజర్వేషన్లలో మార్పులు జరిగే అవకాశం లేకపోలేదు.

సంక్షేమ పథకాలు అమలు చేయాలి



మాట్లాడుతున్న ఎంపీ నగేశ్, పక్కన కలెక్టర్ అభిలాష అభినవ్, ఎమ్మెల్యేలు ఏలేటి, రామారావుపటేల్

- దిశ సమావేశంలో ఎంపీ గోడం నగేశ్
- హాజరైన ఎమ్మెల్యేలు, అధికారులు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అభివృద్ధి, సంక్షేమ పథకాలను వందశాతం అమలు చేయాలని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎంపీ అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.కోట్ల వ్యయంతో చేపట్టిన ప్రగతి పనుల లక్ష్యాలకు సంబంధించి పంచాయతీరాజ్, జాతీయ రహదారుల విభాగం, గ్రామీణాభివృద్ధి, మెప్మా, బీఎస్ఎన్ఎల్, ఆర్‌అండ్‌బీ, ఐటీడీఏ, జిల్లా పరిషత్, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్, వ్యవసాయ, విద్య, వైద్యం, ఆరోగ్యం, మహిళా శిశుసంక్షేమం, నీటిపారుదల, మున్సిపల్ తదితర శాఖల పురోగతిపై చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. జాబ్‌కార్డు కలిగిన ప్రతీ ఉపాధి కూలీకి వంద రోజుల పని కల్పించాలని సూచించారు. అర్హులకు పింఛన్లు మంజూరు చేయాలని, సదరం క్యాంపులు నిర్వహించి ధ్రువపత్రాల మంజూరుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం ద్వారా అర్హులైన కులవృత్తుల వారికి రుణాలు మంజూరు చేయాలన్నారు. గిరిజన గ్రామాల్లో పంచాయతీ, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల భవన నిర్మాణాలు వేగవంతం చేయాలని పేర్కొన్నారు. నిర్దేశిత ప్రాంతాల్లో వెంటనే బీఎస్ఎన్ఎల్ టవర్లు ఏర్పాటు చేయాలని, గిరిజన ప్రాంతాల్లో రోడ్లకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని, పీఎం అమ్మ ఆదర్శ గ్రామ యోజన, అమృత్ పథకంలో మరుగుదొడ్లు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని ఆదేశించారు. జిల్లాలోని మారుమూల గ్రామాలకు సింగిల్ ఫేజ్ నుంచి త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ గ్రామానికి బీటీ రోడ్లు నిర్మించాలని సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వివిధ శాఖల ద్వారా అమలవుతున్న అభివృద్ధి పనుల పురోగతిలో అధికారులంతా సమన్వయంతో పనిచేస్తూ ప్రగతి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. రుణమాఫీ కాని అర్హులైన రైతుల వివరాలు ప్రభుత్వానికి నివేదించామని తెలిపారు. నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. కడ్తాల్ ఫ్లైఓవర్ నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేసి ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించాలని కోరారు. సోన్ జాతీయ రహదారికి మరమ్మతులు చేపట్టి వర్షపు నీరు సమీప ఇళ్లలోకి రాకుండా చర్యలు తీసుకోవాలని నేషనల్ హైవే ప్రాజెక్ట్ డైరెక్టర్‌ను ఆదేశించారు. జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ డెంగీ, మలేరియా టైఫాయిడ్ బారిన పడిన వారికి ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. మిషన్ భగీరథ పైపులైన్ మరమ్మతులు చేపట్టి ప్రతీ ఇంటికి తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఉపాధిహామీ పథకంలో సాగు భూములకు రహదారి సౌకర్యం కల్పించే పనులు చేపట్టాలని డీఆర్డీవోకు సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, డీఆర్వో భుజంగ్‌రావు, ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ సత్యం, వివిధ శాఖల జిల్లా అధికారులు విజయలక్ష్మి, గోవింద్, బాబురావు, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్, శంకరయ్య, అశోక్‌కుమార్, రాజేందర్, సీఎస్ రావ్, నరసింహారెడ్డి, సుభాష్, సందీప్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రుణమాఫీ చేయాలి



రైతు ధర్నాలో మాట్లాడుతున్న ఎంపీ నగేశ్, వేదికపై బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, నాయకులు

- బీజేఎల్పీ నేత ఏలేటి, ఎంపీ నగేశ్
- నిర్మల్‌లో ఒక్కరోజు రైతు ధర్నా

నిర్మల్‌చైన్‌గేట్: రాష్ట్ర ప్రభుత్వం ఆంక్షలు లేకుండా అర్హులైన రైతులందరి పంట రుణాలు మాఫీ చేయాలని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎంపీ నగేశ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట శుక్రవారం రైతుధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతుల పక్షాన పోరాడి కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచి అర్హులందరికీ రుణమాఫీ జరిగేలా చూస్తామని చెప్పారు. రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమైన కాంగ్రెస్ నాయకులు పదవులకు రాజీనామా చేసి ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మోహన్‌రావు పటేల్, నాయకుడు భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: జిల్లా క్రీడల అధికారిగా బీ శ్రీకాంత్‌రెడ్డి శుక్రవారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు కరీంనగర్ డీవైఎస్వోగా బాధ్యతలు నిర్వర్తించి నిర్మల్‌కు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా పలువురు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ అభినవ్ అభిలాషను మర్యాదపూర్వకంగా కలిసిన శ్రీకాంత్‌రెడ్డి పూలమొక్క అందజేశారు.

రేపు క్రికెట్ జట్ల ఎంపిక

నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 25న అండర్–16, 19 విభాగాల్లో జిల్లా క్రికెట్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు టీసీఏ జిల్లా కోచ్ రామరాజు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. నిర్మల్ పట్టణంలోని గండి రామన్న సాయిబాబా ఆలయ సమీపంలోని క్రికెట్ శిక్షణ కేంద్రంలో ఎంపిక పోటీలుంటాయని పేర్కొన్నారు. క్రీడాకారులు ఆధార్‌కార్డు, పదో తరగతి మెమో, బోనాఫైడ్, క్రికెట్ కిట్, వైట్‌డ్రెస్‌తో రావాలని, పూర్తి వివరాలకు 9912939724 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

క్రీడలతో మానసికోల్లాసం




క్రీడాకారులతో ఎస్పీ, ఏఎస్పీ, డీఎస్పీ

నిర్మల్‌టౌన్: పోలీస్ సిబ్బంది ఎప్పుడూ శాంతిభద్రతల విధుల్లో బిజీగా ఉంటారని, వారికి మానసికోల్లాసం కలిగించేందుకు ఆటలు ఎంతో దోహదపడుతాయని ఎస్పీ జానకీ షర్మిల పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాల మైదానంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి టైగర్స్ ట్రోఫీ–2024 క్రికెట్ పోటీలు నిర్వహించారు. పోటీలు రెండు రోజులపాటు కొనసాగనున్నాయి. ఇందులో జిల్లాలోని ఐదు పోలీస్ సర్కిల్స్ టీంలు, ఒక నిర్మల్ టౌన్, ఒక హెడ్ క్వార్టర్స్ టీం, రెండు బెటాలియన్ టీంలు పాల్గొంటున్నాయి. పోటీలను ఎస్పీ ప్రారంభించారు. అనంతరం కాసేపు బ్యాటింగ్ చేసి అందరినీ ఆకర్షించారు. టోర్నమెంట్‌ను భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్, నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జిల్లాలోని ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న ఎస్పీ జానకీ షర్మిల

నిజాయతీ చాటుకున్న బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్



బాధితుడికి సెల్‌ఫోన్, పర్సు ఇస్తున్న కానిస్టేబుల్ చంద్రశేఖర్

భైంసాటౌన్: భైంసా పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్ చంద్రశేఖర్ నిజాయతీ చాటుకున్నారు. స్థానిక వైష్ణవి పెట్రోల్‌పంపు మేనేజర్ మక్కాజి లక్ష్మణ్ శుక్రవారం సాయంత్రం విధులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా, సెల్‌ఫోన్, పర్సు పోగొట్టుకున్నాడు. అదే ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్ చంద్రశేఖర్‌కు అతడి మొబైల్ ఫోన్, పర్సు దొరికాయి. ఈ మేరకు సీఐ రాజారెడ్డికి సమాచారమిచ్చారు. దీంతో బాధితుడి వివరాలు తెలుసుకుని సెల్‌ఫోన్‌తోపాటు పర్సులోని రూ.1,500, ఏటీఎం, ఇతర కార్డులు అందజేశారు. నిజాయతీ చాటుకున్న కానిస్టేబుల్ చంద్రశేఖర్‌ను సీఐ అభినందించారు.

నాణ్యమైన భోజనం అందించాలి

నిర్మల్‌చైన్‌గేట్: ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ (రెవెన్యూ) అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక సోఫీనగర్‌లోని సోన్, నిర్మల్ కేజీబీవీలను తనిఖీ చేశారు. ప్రభుత్వం మధ్యాహ్న భోజనానికి సరఫరా చేస్తున్న సన్న బియ్యం, ఇతర వంట సామగ్రిని తనిఖీ చేశారు. సన్న బియ్యం, వంట సామగ్రికి సంబంధించి రిజిష్టర్లు, రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, వంటకు నాణ్యమైన వస్తువులు మాత్రమే వాడాలని సూచించారు. పాఠశాల పరిసరాలు పరిశీలించారు. నిరంతరం పరిశుభ్రత పాటించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్వోఆర్‌పై అవగాహన అవసరం

- కలెక్టర్ అభిలాష అభినవ్
- నూతన చట్టంపై వర్క్‌షాప్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్: నూతన ఆర్వోఆర్ చట్టంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నూతన ఆర్వోఆర్ చట్టంపై నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆమె మాట్లాడారు. రెవెన్యూ అధికారులు, రిటైర్డ్ అధికారులు, న్యాయ నిపుణులతో ఆర్వోఆర్ బిల్లుపై విస్తృతంగా చర్చించారు. ఆర్వోఆర్ బిల్లుపై అధికారులు, న్యాయనిపుణుల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కొత్త ఆర్వోఆర్ చట్టం కాపీని ఇదివరకే సీసీఎల్ఏ వెబ్‌సైట్‌లో పబ్లిక్ డొమైన్‌లో ఉంచారని తెలిపారు. తద్వారా ప్రజల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించడానికి అవకాశం కల్పించారని పేర్కొన్నారు. ఆర్వోఆర్ బిల్లుపై ప్రజల సందేహాలను అధికారులు నివృత్తి చేయాలని ఆదేశించారు. బిల్లులో గల అంశాలను ప్రజలకు వివరిస్తూ అవగాహన కల్పించాలని సూచించారు. క్షేత్ర స్థాయిలోనూ ప్రజల నుంచి ఆర్వోఆర్ బిల్లుపై సలహాలు, సూచనలు స్వీకరించాలని తెలిపారు. అధికారులు తమ రోజువారీ విధుల్లో భాగంగా ఇంతకుముందున్న 2020 చట్టంలో ప్రజల నుంచి ఎన్నో ఫిర్యాదులు స్వీకరించారని, ఈ క్రమంలో ఎదురైన అనుభవాల ద్వారా కొత్త ఆర్వోఆర్ బిల్లులో గల అంశాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఆర్వోఆర్ చట్టం బిల్లుకు సంబంధించి వివరణలు, నిర్వచనాలు ఇతర అంశాలను అధికారులతో చర్చించారు. అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, డీఆర్వో భుజంగ్‌రావు, నిర్మల్, ముథోల్ ఆర్డీవోలు రత్నకళ్యాణి, కోమల్‌రెడ్డి, రెవెన్యూ అధికారులు, న్యాయ నిపుణులు, రిటైర్డ్ అధికారులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి



నిరసన తెలుపుతున్న నాయకులు, ఉద్యోగులు

నిర్మల్‌ఖిల్లా: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని నీటిపారుదల శాఖ ఉద్యోగుల ఆధ్వర్యంలో సీపీఎస్‌ను నిరసిస్తూ బ్లాక్ డే పాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి పాత పెన్షన్ విధానాన్ని అమలులోకి తేవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు చక్కెర శ్రీనివాస్, శరత్, సంతోష్‌సింగ్, సాయికృష్ణ, పడిగల రమణ, శ్రీనివాస్‌రెడ్డి, భూమన్న, లింగేశ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత

సీపీఎస్‌ను తక్షణమే రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ కలెక్టరేట్‌లో పరిపాలనాధికారి సూర్యారావుకు సీపీఎస్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎస్ జిల్లా నాయకుడు కృష్ణారావు మాట్లాడారు. సీపీఎస్ ద్వారా ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోతున్నారని వాపోయారు. కుటుంబాలకు భరోసా లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

జిల్లా ఏజెన్సీలకే బాధ్యతలివ్వాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న భవాని

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా ఏజెన్సీలకే అవుట్ సోర్సింగ్ బాధ్యతలు అప్పగించాలని కాంగ్రెస్ మహిళా విభాగం నిర్మల్ అధ్యక్షురాలు సీహెచ్ భవాని కోరారు. శుక్రవారం ఆమె కలెక్టర్ అభిలాష అభినవ్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. జిల్లాలో ఎన్నో ఏళ్లుగా పని చేస్తున్న ఏజెన్సీలను కాదని ప్రభుత్వం బ్లాక్ లిస్ట్‌లో పెట్టిన ఇతర జిల్లాల ఏజెన్సీలకు జిల్లా అవుట్ సోర్సింగ్ బాధ్యతలు అప్పగిస్తే నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని తెలిపారు. ఏ చిన్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగినైనా మెరిట్, రోస్టర్ పాయింట్లతో తీసుకోకుంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు బనోద్ గోవింద్‌నాయక్, బ్లాక్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు లక్ష్మి, నాయకురాళ్లు జలజ, రమ, శారద, పరిమళ పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


మహ్మద్ ఫైజల్ (ఫైల్)

భైంసాటౌన్: నిజామాబాద్ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో భైంసా పట్టణానికి చెందిన మహ్మద్ ఫైజల్ (26) అనే యువకుడు మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి.. భైంసాకు చెందిన మహ్మద్ ఫైజల్ గురువారం రాత్రి తన స్నేహితులతో కలిసి టవేరా వాహనంలో భైంసా నుంచి బోధన్‌లో జరిగే సందల్ కార్యక్రమానికి వెళ్తుండగా నవీపేట మండలంలోని అబ్బాపూర్ వద్ద వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఘటనలో మహ్మద్ ఫైజల్ అక్కడికక్కడే మృతి చెందగా అల్మాస్, రిజ్వాన్, ఉమెర్, యాకుబ్, ఇర్షాద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. నవీపేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని చాందా (టి) శివారు ప్రాంతంలో జాతీయ రహదారి 44పై జరిగిన రోడ్డు ప్రమాదంలో పుప్పాల భూమయ్య (40)దుర్మరణం చెందినట్లు ఆదిలాబాద్ రూరల్ ఎస్సై ముజాహిద్ తెలిపారు. జైనథ్ మండలం బాలాపూర్‌కు చెందిన భూమయ్య ఆదిలాబాద్ పట్టణంలో మోటార్ సైకిల్ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం ఉదయం ద్విచక్ర వాహనంపై బాలాపూర్ నుంచి ఆదిలాబాద్ వెళ్తుండగా మార్గమధ్యలో గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

లక్ష్మణచాంద: మండలంలోని కనకాపూర్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. శుక్రవారం మధ్యాహ్నం కనకాపూర్ గ్రామానికి చెందిన ముత్యాల అరుణ్ పరిమండల్ రోడ్డు వైపు ఉన్న ఫంక్షన్ హాల్ వైపు నుండి బైక్‌పై గ్రామానికి వస్తుండగా జగిత్యాల జిల్లా మల్యాల మండలం తాటిపల్లికి చెందిన దోష గంగాధర్ కారులో వస్తూ బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో అరుణ్‌కు తీవ్ర గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు ఆటోలో నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. గంగాధర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుమలత తెలిపారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఉట్నూర్‌రూరల్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని వైకల్యం కలిగిన గిరిజన నిరుద్యోగ యువతీ యువకులకు యూత్ ఫర్ జాబ్స్ ఆధ్వర్యంలో రిటైల్, హాస్పిటాలిటీ, బీఎఫ్ఎస్ఐ కోర్సుల్లో 2 నెలల పాటు హైదరాబాద్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు దివ్యాంగులు సదరం సర్టిఫికెట్ 40 నుంచి 100 శాతం వైకల్యం, 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు, టెన్త్, ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఆసక్తి గల నిరుద్యోగులు ధ్రువీకరణ పత్రాలతో ఈ నెల 30 సాయంత్రం 6 గంటలలోగా ఐటీడీఏ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9010295910 నంబరులో సంప్రదించాలని సూచించారు.

గల్ఫ్ గాయం.. తీరని దుఃఖం!

ఖానాపూర్ మండలం గోసంపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని నడింపల్లెకు చెందిన పుల్కం రాజేశ్వర్ ఉపాధి నిమిత్తం మూడేళ్ల క్రితం దుబాయ్ వెళ్లాడు. అక్కడ కూలి పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఈనెల 8న గుండెపోటు రావడంతో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. దుబాయ్‌లో ఉన్న బంధువులు మృతదేహాన్ని స్వగ్రామానికి పంపించారు.

నిర్మల్ జిల్లా భైంసా మండలం కోతుల్‌గామ్ గ్రామానికి చెందిన సట్ల నరసయ్య జీవనోపాధికోసం ఏడాది క్రితం దుబాయ్‌కి వలస వెళ్లాడు. వారం రోజులక్రితం అనారోగ్యానికి గురయ్యాడు. ఆదివారం వ్యాధి తీవ్రత ఎక్కువ కావడంతో తాను ఉంటున్న గదికే పరిమితమయ్యాడు. మంగళవారం తోటి కార్మికులు వెళ్లి చూడగా శవమై కనిపించాడు. మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించే ఏర్పాట్లు చేయాలని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

మంచిర్యాల జిల్లా జన్నారం మండలం దేవునిగూడకు చెందిన కునారపు వెంకటేశ్ (28) ఉపాధి కోసం గతేడాది ఇరాక్ దేశం వెళ్లాడు. నాలుగు నెలలు అక్కడ పనిచేశాడు. అప్పుల బాధ, ఆర్థిక ఇబ్బందులతో మానసికంగా కృంగిపోయాడు. ఈ ఏడాది జనవరిలో గుండెపోటుతో మృతి చెందాడు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

నిర్మల్ జిల్లా భైంసా మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన మెండోళ్ల సుధాకర్ ఆరునెలల క్రితం జిల్లాకు చెందిన ఓ ఏజెంట్‌కు లక్షలు చెల్లించి విజిట్ వీసాపై బహ్రెయిన్ వెళ్లాడు. అక్కడ సరైన పని దొరకక, చేసిన పనికి వేతనం రాక నరకయాతన అనుభవించాడు. దీంతో మనస్తాపానికి గురై ఈనెల 15న ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని తెప్పించేందుకు గల్ఫ్ కార్మిక సంఘాల నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు.

మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం పాత మామిడిపల్లికి చెందిన పత్తిపాక వెంకటేశ్ (41) ఉపాధి నిమిత్తం గతేడాది జూన్ 21న సౌదీ వెళ్లాడు. అక్కడే పనిచేస్తుండగా జూలై 3న ఫిట్స్ రావడంతో తోటి కార్మికులు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ అదే నెల 8న మృతి చెందాడు. 19 రోజులకు మృతదేహం స్వగ్రామం చేరుకుంది.

- బతుకుదెరువుకు వెళ్లి మృత్యువాత పడుతున్న కార్మికులు
- నకిలీ ఏజెంట్ల వలలోపడి విలవిల..
- అక్కడ ఉండలేక, ఇక్కడికి రాలేక నరకయాతన
- కుటుంబ సభ్యుల అరణ్యరోదన
- కొనసాగుతున్న వరుస ఘటనలు


దేవునిగూడలో వెంకటేశ్ శవపేటికపై పడి రోదిస్తున్న కుటుంబసభ్యులు(ఫైల్)


గల్ఫ్ వలసలపై అవగాహన కల్పిస్తున్న గల్ఫ్ సంఘాల నాయకులు (ఫైల్)


దుబాయ్‌లో ఆత్మహత్యచేసుకున్న వ్యక్తి మృతదేహాన్ని స్వగ్రామానికి తెప్పించాలని గల్ఫ్‌నాయకులకు విన్నవిస్తున్న బాధిత కుటుంబీకులు(ఫైల్)

నిర్మల్‌ఖిల్లా: 'దూరపు కొండలు నునుపు' అనే చందంగా ఉన్న ఊరిలో ఉపాధి అవకాశాలు లేక గల్ఫ్ దేశాలకు వెళ్తే ఆర్థికంగా బాగుపడతామని జిల్లా నుండి ఒకరిని చూసి మరొకరు దుబాయ్, కువైట్, బహ్రెయిన్, తదితర దేశాలకు వలసబాట పడుతున్నారు. అలా వెళ్లినవారు అప్పుల బారినపడి అక్కడే తనువు చాలిస్తున్న ఘటనలు జిల్లాలో అనేకం కనిపిస్తున్నాయి. మృతదేహాల కోసం కుటుంబ సభ్యులు నెలల తరబడి ఎదురు చూడడం, ప్రభుత్వాలు, కార్మిక సంఘాల నాయకులను వేడుకోవడం వంటి ఉదంతాలు జిల్లాలో అనేకం కనిపిస్తున్నాయి.

నకిలీ వీసాలతోనే...

విదేశాల్లో ఉద్యోగాల పేరిట నకిలీ ఏజెంట్ల మోసాలు నానాటికీ పెరిగిపోతున్నాయి. కొన్నేళ్లుగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి గల్ఫ్ దేశాలకు వలసలు పెరిగిపోతుండడంతో ఇటీవల ఏజెంట్ల సంఖ్య కూడా ఎక్కువైపోతోంది. గ్రామీణ ప్రాంతాలవారు గల్ఫ్ దేశాలబాట పట్టేందుకు ఆసక్తి చూపుతుండటంతో వారికి ఎక్కువ జీతాలను ఏరచూపుతూ వల వేస్తున్నారు. దీంతో నకిలీ ఏజెంట్ల బారినపడి అక్కడికి వెళ్లిన కార్మికులు తీవ్ర అపసోపాలు పడుతున్నారు. అక్కడ సరైన వేతనం లేక ఆర్థికంగా చితికిపోతున్నారు. గత్యంతరం లేక అక్కడే బలవన్మరణాలకు పాల్పడటమో, మనోవేదనతో గుండెపోటుకు గురికావడంతోనో తనువు చాలిస్తున్నారు.

ఉపాధి అవకాశాలు లేకనే..

ఉన్న ఊరిలో ఉపాధి అవకాశాలు లేక గల్ఫ్ దేశాల బాట పడుతున్న కార్మికులు అక్కడ నరకయాతన అనుభవిస్తున్నారు. ఎప్పుడు స్వగ్రామానికి తిరిగి వస్తామో తెలియని పరిస్థితి నెలకొంటుంది. ఉమ్మడి జిల్లా నుండి ఎన్నో ఆశలతో కువైట్, సౌదీ అరేబియా, ఖతార్, బహ్రెయిన్, దుబాయ్ తదితర గల్ఫ్ దేశాలకు వెళ్తున్న కార్మికులు ఏజెంట్ల మోసాలతో వేదన అనుభవిస్తున్న తీరు ఇటీవల విడుదల చేస్తున్న సెల్ఫీ వీడియోలు తెలియజేస్తున్నాయి. చేసిన పనికి సరైన వేతనం అందటం మాట అటుంచి తిరిగి ఇంటికి రావాలన్నా విమాన ప్రయాణ చార్జీలకు వేలాది రూపాయలు వెచ్చించలేక మానసిక ఒత్తిడికి గురై అక్కడే మృత్యువాత పడుతున్న ఉదంతాలు వరుసగా వెలుగుచూస్తున్నాయి.

విజిట్ వీసాలతో గాలం

గల్ఫ్ దేశాల్లో ఉద్యోగం అనగానే ఎగిరి గంతేస్తూ ఇక్కడి కార్మికులు సరైన నైపుణ్యం లేకుండానే ఫ్లైట్ ఎక్కి విదేశాలకు వెళ్లిపోతున్నారు. తీరా అక్కడికి వెళ్లిన తర్వాత సరైన నైపుణ్యాలు లేకపోవడంతో అష్టకష్టాలు అనుభవిస్తున్నారు. దీనికి తోడు విజిట్ వీసాపై వెళ్లి అక్కడ నైట్ వాచ్‌మెన్‌గా, కాపలాదారులుగా, ఇతర షాపింగ్‌మాల్స్‌లో లేబర్లుగా, గొర్రెలు, మేకల కాపరులుగా పనులు చేస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. కంపెనీ వీసా పేరుతో ఒక్కొక్కరి వద్ద రూ.రెండు లక్షల నుంచి నాలుగు లక్షల వరకు వసూలు చేసి ఏజెంట్లు మోసం చేస్తున్నారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గల్ఫ్ దేశాలకు వలస బాట పడుతున్న కార్మికులకు సహకారం అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రభుత్వ సహకారం అవసరం



గల్ఫ్ దేశాలకు వలసబాట పడుతున్న కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన సహకారం అందించాలి. అనుమతి పొందిన ఏజెంట్ల ద్వారానే విదేశాలకు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలి. గల్ఫ్ దేశాల బాట పడుతున్న వారికి ఇక్కడే పలు రంగాల్లో స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తే వలసలు కూడా తగ్గుముఖం పడుతాయి. ఇక్కడే ఉపాధి అవకాశాలు పెంచుకునేలా చైతన్యం కల్పించాలి. గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడం ద్వారా పలు సమస్యలకు పరిష్కారం లభిస్తుంది.

– స్వదేశ్ పరికిపండ్ల, ప్రవాసీమిత్ర లేబర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు, నిర్మల్

చికిత్స పొందుతూ మహిళ మృతి

లోకేశ్వరం: మండలంలోని దుర్గానగర్ తండాకు చెందిన రాపని లక్ష్మి(32) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. ఎస్సై అశోక్ తెలిపిన వివరాల ప్రకారం తండాకు చెందిన లక్ష్మి, నర్సింలు దంపతులు బండరాళ్లు కొడుతు జీవనం సాగిస్తున్నారు. గురువారం తన తోటి కూలీలతో కలిసి బండరాళ్లు కొట్టడానికి రాయపూర్‌కాండ్లీ శివారు ప్రాంతంలోకి వెళ్లింది. సాయంత్రం ఇంటికి రాగానే నోరు, ముక్కు నుంచి నురగలు రావడంతో కుటుంబ సభ్యులు భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు నిర్మల్ పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి తల్లి దేవరంగుల నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పిడుగుపాటుతో ఎద్దు మృతి.. ఒకరికి గాయాలు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని మారుతినగర్‌లో పిడుగు పాటుతో ఎద్దు మృతి చెందగా ఒకరికి గాయాలయ్యాయి. టేకం రామారావుకు చెందిన ఎద్దు అక్కడికక్కడే మృతి చెందగా మాజీ సర్పంచ్ సిడాం గంగారాంకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీపీ జైవంత్‌రావు సంఘటన స్థలానికి చేరుకొని గంగారాంను 108 ద్వారా ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు రెఫర్ చేశారు.

ద్విచక్ర వాహనం చోరీ

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన దుర్వే రామ్ ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. శుక్రవారం భీంసరి నుంచి వరలక్ష్మీనగర్ వైపు వస్తున్న క్రమంలో మార్గమధ్యలో వాహనాన్ని నిలిపి మూత్రవిసర్జనకు వెళ్లగా గుర్తు తెలియని వ్యక్తి వాహనాన్ని ఎత్తుకెళ్లాడు. ట్యాంక్ కవర్‌లో మొబైల్ ఫోన్ సైతం ఉన్నట్లు బాధితుడు పేర్కొన్నారు. ఈ మేరకు టూటౌన్ విష్ణుప్రకాష్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

28న జాతీయ క్రీడా దినోత్సవం

ఉట్నూర్‌రూరల్: మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని ఈనెల 28న ఉట్నూర్‌లో జాతీయ క్రీడాదినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం కేబీ కాంప్లెక్స్ ప్రధాన గేటు నుంచి పరుగు ప్రారంభమవుతుందన్నారు. ఉమ్మడి జిల్లాలోని ఆశ్రమ పాఠశాలలు, ఆదర్శ క్రీడా పాఠశాలలకు చెందిన గిరి విద్యార్థులను సత్కరిస్తామన్నారు.

వైభవంగా సౌభాగ్యలక్ష్మీ వ్రతం


పాల్గొన్న మహిళలు

- బాసరకు తరలివచ్చిన భక్తజనం

బాసర: నిర్మల్ జిల్లాలోని బాసర శ్రీజ్ఞానసరస్వతీ అమ్మవారి ఆలయానికి శ్రావణ శోభ సంతరించుకుంది. శ్రావణంలో మూడో శుక్రవారం కావడంతో అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ ఆవరణలో సౌభాగ్యలక్ష్మీ వ్రతం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు వేకువజామున మహాలక్ష్మీ, సరస్వతీ, మహాకాళీ అమ్మవార్లకు వేద మంత్రోచ్చారణల మ ధ్య అభిషేకం, అ ర్చన, విశేష గణపతిపూజ ఘనంగా నిర్వహించారు. భ క్తులు ముందుగా పవిత్ర గోదావరి నదిలో పుణ్యస్నానాలాచరించారు. క్యూలో బారులు తీరి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి రెండు గంటల సమయపట్టింది. ప్రత్యేక అక్షరాభ్యాస మండపంలో చిన్నారులతో అక్షర శ్రీకార పూజలు చేయించారు. తెలంగాణ నుంచే కాకుండా మహా రాష్ట్ర, ఏపీ, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు అధికసంఖ్యలో వచ్చి అమ్మవారికి ప్రత్యేకపూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి విజయరామారావు తెలిపారు.


సౌభాగ్యలక్ష్మీ వ్రతపూజ నిర్వహిస్తున్న అర్చకులు

ఆర్జీయూకేటీలో అవగాహన సదస్సు

బాసర: నిర్మల్ జిల్లా బాసర ఆర్జీయూకేటీలో పీయూసీ పూర్తి చేసి బీటెక్ ఫస్టియర్‌లో చేరే విద్యార్థుల కోసం శుక్రవారం అవగాహన సదస్సు ప్రారంభించారు. ఏఐసీటీఈ నిబంధనల మేరకు వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ ఆదేశాలతో పదిరోజులపాటు కార్యక్రమం నిర్వహించనున్నట్లు యూనివర్సిటీ అధికారులు తెలిపారు. ఇంజినీరింగ్ బ్రాంచ్‌ల ప్రాముఖ్యత, పరిచయం, వివిధ డిపార్ట్‌మెంట్లలోని సౌకర్యాలు, ఉపాధి, ఉద్యోగావకాశాలు, ప్లేస్‌మెంట్ గణాంకాలు, బీటెక్ తర్వాత కెరీర్ మార్గదర్శకాల ప్రస్తావన తదితర అంశాల గురించి ప్రొఫెసర్లు, నిపుణులు, మేధావులు, పారిశ్రామికవేత్తలు అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగం అధ్యాపకుడు రణదీర్ సాగి మాట్లాడుతూ.. సమాజంలో ఉత్తమ ఇంజినీర్ అయ్యేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి తెలిపారు. ఇటీవల టీఎస్‌పీఎస్సీ చేపట్టిన ఉద్యోగ నియామకాల్లో సివిల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన 84 మంది పూర్వ విద్యార్థులు ఏఈఈలుగా ఎంపికైనట్లు పేర్కొన్నారు. వీరితో అభినందన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు గుర్తు చేశారు. సమన్వయకర్త కిరణ్‌కుమార్ ఆత్యం, అధ్యాపకులు పాల్గొన్నారు.


ప్రోగ్రాంలో పాల్గొన్న విద్యార్థులు

ఆంగ్లభాషా నైపుణ్యాల మెరుగుకు చర్యలు

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన ఐటీడీఏ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఆంగ్లభాషా నైపుణ్యాలను మెరుగుపర్చడమే లక్ష్యంగా విబా, లీఫ్ ఫర్ వర్డ్ సంస్థ సహకారంతో ముందుకెళ్తున్నామని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. శుక్రవారం ఐటీడీఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. 3వ తరగతి నుండి 5వ తరగతి విద్యార్థులకు ఈ కార్యక్రమం రూపొందించడం జరుగుతుందన్నారు. ఎలిమెంటరీ రీడింగ్, అడ్వాన్స్‌డ్ రీడింగ్ స్థాయిలుగా రూపకల్పన చేయబడిందన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీవో వసంత్ రావు, సంస్థ సభ్యులు వీరనారాయణ, చైతన్య చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న పీవో

27న 'నిధి ఆప్కే నిఖత్'పై అవగాహన

కైలాస్‌నగర్: ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ ఆధ్వర్యంలో (నిధి ఆప్‌కే నిఖత్) భవిష్యనిధి మీ వద్దకు కార్యక్రమంలో భాగంగా ఈ నెల 27న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని అన్ని జిల్లా కేంద్రాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ప్రావిడెంట్ ఫండ్ అసిస్టెంట్ కమిషనర్ ఎం.సుబ్రహ్మణ్యం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదిలాబాద్‌లో డీఆర్డీఏ కార్యాలయ సమావేశ మందిరంలో, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో సిర్పూర్ కాగజ్‌నగర్‌లోని కృష్ణవేణి ఉన్నత పాఠశాల, మంచిర్యాలలో డీఆర్డీఏ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్లో, నిర్మల్ జిల్లాలో గాజులపేట ప్రిన్స్ హైస్కూల్‌లో ఈ కార్యక్రమాలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5.45 గంటల వరకు నిర్వహించనున్న కార్యక్రమంలో కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య

నర్సాపూర్(జి): పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రానికి చెందిన సాయారెడ్డి (38) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో మనస్తాపం చెంది శుక్రవారం పంటచేనులో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య సుమలత, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుని తండ్రి మోహన్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై హన్మాండ్లు పేర్కొన్నారు.

డెంగీతో వృద్ధురాలు మృతి?

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీలో ఈఏడాది తొలి డెంగీ మరణం నమోదైంది. మున్సిపాలిటీ పరిధి 9వవార్డు సుబ్బారావుపల్లి గ్రామానికి చెందిన మేరుగు రామక్క (75) డెంగీతో శుక్రవారం మృతి చెందింది. వృద్ధురాలికి పది రోజుల క్రితం తీవ్రమైన జ్వరం రావడంతో వైద్యసిబ్బంది పరీక్షలు నిర్వహించి డెంగీ జ్వరంగా నిర్ధారించినట్లు గ్రామస్తులు తెలిపారు. మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందినప్పటికీ జ్వరం అదుపులోకి రాలేదు. పరిస్థితి మరింతగా విషమించి కన్ను మూసింది. దీంతో గ్రామంలో భయాందోళనలు నెలకొన్నాయి. గ్రామంలో దోమల నివారణకు సత్వర చర్యలు తీసుకోవాలని, వైద్యశిబిరం ఏర్పాటు చేయాలని ఆ వార్డు కౌన్సిలర్ బూక్య రాములు నాయక్ డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు

- ఒకరి పరిస్థితి విషమం



గాయపడిన గోవింద్, పోశన్న


గాయపడిన ఆటో డ్రైవర్ ప్రకాశ్

లక్ష్మణచాంద: మండలంలోని నర్సాపూర్–ఒడ్డెపెల్లి గ్రామాల మధ్య ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. శుక్రవారం మధ్యాహ్నం మామడ నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న కారు నర్సాపూర్–ఒడ్డెపెల్లి గ్రామాల మధ్య జాతీయ రహదారి పక్కన ఆగి ఉన్న ఆటోను, రోడ్డు పక్కన ఉన్న వ్యక్తులను ఢీకొట్టింది. ఎస్సై సుమలత తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని నర్సాపూర్–ఒడ్డెపెల్లి గ్రామాల మధ్య నర్సాపూర్ గ్రామానికి చెందిన పోషన్న మొక్కజొన్న కంకులు అమ్ముతుండగా కడెం నుండి నిర్మల్ వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన కూలీలు అక్కడ ఆగి కంకులు కొనుగోలు చేస్తున్నారు. అదే సమయంలో భైంసా నుండి మామడ వైపునకు దగడే ప్రకాష్ ఆటోలో సామానుతో వెళ్తున్నాడు. ఇదే సమయంలో మామడ నుండి నిర్మల్ వైపు కారులో వచ్చిన సారంగాపూర్ మండలంలోని వంజర్ గ్రామానికి చెందిన దంసం రాంరెడ్డి ముందుగా మొక్కజొన్న కంకులు అమ్మే పోషన్నను, కంకులు కొనుగోలు చేస్తున్న గోవింద్‌ను ఢీకొట్టిన అనంతరం ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టాడు. దీంతో ఆటో డ్రైవర్ ప్రకాష్, గోవింద్, పోశన్నకు తీవ్ర గాయాలయ్యాయి, గమనించిన స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో ముందుగా నిర్మల్ ఏరియా ఆస్పత్రికి, మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌కు తరలించించారు. గోవింద్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. అజాగ్రత్తగా కారు నడిపి ముగ్గుర్ని గాయపర్చిన రాంరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్‌శాఖలో ఉత్తమ పురస్కారాలు

మంచిర్యాలఅగ్రికల్చర్: ఎన్‌పీడీసీఎల్ పరిధిలో ఉద్యోగుల మధ్య స్నేహపూర్వక పోటీ పెంచి వివిధ పారామీటర్లలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు విద్యుత్ సంస్థ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి 'బెస్ట్ పెర్ఫార్మెన్స్ ఆఫ్ ది మంత్' పేరిట ఏప్రిల్ నుంచి ప్రతీనెల బహుమతులు అందజేస్తున్నట్లు విద్యుత్ శాఖ మంచిర్యాల జిల్లా ఎస్ఈ ఎస్.శ్రావణ్‌కుమార్ తెలిపారు. సప్లై మెయింటనెన్స్, డీటీఆర్ నిర్వహణ, వైఫల్యాలను తగ్గించడం, విద్యుత్ అంతరాయం తగ్గించడం, వినియోగదారులందరికీ సత్వర సేవ, కొత్త సర్వీస్ కనెక్షన్ల మంజూరు, మీటర్ల బిగింపు, ఎనర్జీ ఆడిట్, కెపాసిటర్స్‌ని పెంచడం తదితర మెరుగైన చర్యలు తీసుకుంటూ సంస్థ మనగడకు తోడ్పడడం, వినియోగదారులకు అందుబాటులో ఉంటూ అంతరాయం లేని సరఫరా చేయడం వంటి అంశాలను పరిగణంలోకి తీసుకోవడం జరుగుతుందని వివరించారు. ఏప్రిల్‌లో ఉమ్మడి జిల్లాలో బెల్లంపల్లి రూరల్ ఆపరేషన్ ఏఈ, ఉత్తమ అవార్డు, మేలో హాజీపూర్ ఆపరేషన్ ఏఏఈ సిబ్బందికి, మంచిర్యాల ఎస్ఈ, ఆపరేషన్ సిబ్బందికి ఉత్తమ అవార్డు, జూన్‌లో లక్సెట్టిపేట ఏఈ ఆపరేషన్ సర్కిల్ పరిధి సిబ్బందికి, ఏడీఈ లక్సెట్టిపేట ఆపరేషన్ విభాగం సిబ్బందికి, మంచిర్యాల ఎస్ఈ అపరేషన్ విభాగం సిబ్బందికి, జూలైలో ఏఈ ఆపరేషన్ బెల్లంపల్లి రూరల్ సిబ్బందికి ఉత్తమ అవార్డుకు ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతి

చెన్నూర్‌రూరల్: మండలంలోని సుబ్బరాంపల్లిలో తాటిచెట్టు పైనుంచి కిందపడి ముక్కెర సత్యనారాయణగౌడ్ (38) అనే గీత కార్మికుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బావురావుపేట గ్రామ పంచాయతీ పరిధిలోని గుండాయిపల్లెకు చెందిన ముక్కెర రాజుబాయి, మధునయ్య దంపతుల కుమారుడు సత్యనారాయణగౌడ్ శుక్రవారం తాటికల్లు తీసేందుకు చెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు జారి కింద పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య కనకలక్ష్మి ఉంది. సంఘటనా స్థలాన్ని చెన్నూర్ ఎస్సై శ్వేత పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

మిల్లు యాజమాన్యంపై ఫిర్యాదు

కాగజ్‌నగర్ రూరల్: ఆరు సంవత్సరాలుగా సిర్పూర్ పేపర్ మిల్లు యాజమాన్యం మిల్లులో ఎన్నికలు నిర్వహించడంలేదని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం లేబర్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. హైదరాబాద్‌లోని కార్మికశాఖ కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి చర్చలు జరిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌సీఎల్‌టీ ఆర్డర్ ఇంప్లిమెంట్ చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక కార్మికులను పర్మినెంట్ ఉద్యోగులుగా నియమించాలన్నారు. ఈవిషయమై కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు ఆర్ఎస్పీ పేర్కొన్నారు. ఆయన వెంట నాయకులు లెండుగురె శ్యాంరావు, అంబాల ఓదెలు, నక్క మనోహర్, పేపర్ మిల్లు యూనియన్ నాయకులు ఈర్ల సతీశ్, రహీం, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.